దుకాణాలతో ఇరుగ్గా రోడ్డు

తగరపువలస - భీమిలి మార్గంలో రాకపోకలకు అవస్థలు



తగరపువలస - భీమిలి రోడ్డు



ఆంధ్రా బ్యాంకు కూడలిలో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు

తగరపువలస: భీమిలి రోడ్డులో ఇరువైపులా రోజుకో దుకాణం పుట్టుకొస్తుండటంతో మార్గం ఇరుకుగా మారిపోతోంది. దుకాణదారులు ఒకరితో ఒకరు పోటీపడి ముందుకు మున్ముందుకు అన్నట్లు దుకాణాలతో దూసుకొస్తున్నారు. దీంతో తమ ఇళ్ల ముందు దుకాణాలు అడ్డంగా ఉంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిట్టివలస గణేష్ థియేటర్ కూడలి నుంచి భీమిలి రహదారిలో తిరుమల ఫంక్షన్ హాలు వరకు దాదాపు రోడ్డంతా ఇరుకుగా మారిపోయింది. కొత్తగా దుకాణాలు పుట్టుకొచ్చి రహదారి ఇరుకుగా మారుతున్నా భీమిలి టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ రజక సంతపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఈ నెల 6న కలెక్టరేట్ స్పందనలో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారులు ఫిర్యాదు చేసిన ఇరువురితోపాటు రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారిని సంతపేట సచివాలయానికి పిలిపించి చర్చలు జరిపారు. రోడ్డును ఇరువైపులా ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారు రాజీకి రాకపోవడంతో చర్చలు వాయిదా పడ్డాయి. మరోమారు ఇరుపార్టీలు స్పందనలో ఫిర్యాదు చేయడానికి సన్నద్ధం అవుతున్నాయి.

ప్రమాదం జరిగితే భారీ ముప్పు

ప్రస్తుతం తగరపువలస - భీమిలి రహదారిలో రోజూ వేలాది ద్విచక్ర వాహనాలు, వందలాది ఆటోలతోపాటు భీమిలి ఇసుక సరఫరా కేంద్రానికి నిత్యం భారీ వాహనాలు వస్తున్నాయి. ఈ ఇరుకైన మార్గంలోనే రోజూ వందలాది స్కూల్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్లు ఇరుకుగా మారడం వల్ల దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగితే పెద్ద ఎత్తున ఆస్తి, ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉంది. అంతేకాకుండా తగరపువలస - భీమిలి రహదారిని ఆనుకుని ఆంధ్రాబ్యాంకు కూడలి వరకు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలు కూడా ఉన్నాయి. ఈ భవనాలను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తూ జీవీఎంసీకి పన్నులు ఎగ్గొడుతున్నారు. మరోవైపు పార్కింగ్‌కు ఎలాంటి స్థలం లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా రోజుల తరబడి వాహనాలు నిలుపుతూ నిత్యం ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నారు. భవిష్యత్‌లో ప్రమాదాలు జరుగకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు మేల్కొని భీమిలి రోడ్డుకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు, దుకాణాలు తొలగించడంతోపాటు అనధికార పార్కింగ్‌లను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆత్మజ్ఞానంతో అజ్ఞానాన్ని పారదోలాలి



భక్తులకు ఉపదేశం చేస్తున్న సాయి ప్రసాద్

ఆనందపురం : మానవులు ఆత్మజ్ఞానాన్ని పెంపొందించుకుని అజ్ఞానాన్ని పారద్రోలాలని సంత్ నిరంకారీ మిషన్ జ్ఞాన్ ప్రచారక్ సాయి ప్రసాద్ బోధించారు. మండలంలోని బోని గ్రామంలో ఆదివారం సంత్ నిరంకారీ సత్సంగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ ప్రవచిస్తూ అన్ని జన్మల కంటే మానవ జన్మకే పరమాత్మను తత్వరూపంలో తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 120 దేశాల్లో విస్తరించిన అతి పెద్ద ఆధ్యాత్మిక సంస్థ సంత్ నిరంకారీ మిషన్ అని వివరించారు. ముందుగా జ్ఞాన ప్రచారకుడు పీవీ రావు 50 మంది బాల బాలికలకు బ్రహ్మజ్ఞానం బోధించారు. కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, బోని సర్పంచ్ బోని అప్పలకొండ, బోని సన్యాసినాయుడు, విశాఖ మండలి సంయోజకులు ప్రేమ్ మిర్చూరి, ప్రాంత్రీయ సంచాలకుడు రవి, బోని ప్రముఖ్ సత్యనారాయణరాజు, పార్వతమ్మ, బోని శ్యామ్ కుమార్, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

స్టీల్ ధరల్లో తేడాలతో నిర్మాణదారుల బెంబేలు

తగరపువలస: భవన నిర్మాణాల్లో వినియోగించే స్టీల్ ధరల్లో మధురవాడతో పోలిస్తే భీమిలిలో భారీగా తేడా ఉండటంతో నిర్మాణదారులు గగ్గోలు పెడుతున్నారు. 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఈ రెండు ప్రాంతాల మధ్య వైజాగ్ స్టీల్ టన్ను ధర రూ.12వేలు తేడా ఉండటంతో ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తగరపువలసను ఆనుకుని సంగివలసలో ఇంటి నిర్మాణం చేపట్టిన ఆరోగ్యశాఖకు చెందిన ఒక విశ్రాంత ఉద్యోగిని మధురవాడ జోన్‌లో దుకాణాల నుంచి భవన నిర్మాణ సామాగ్రి కొనుగోలు ఇటీవల చేశారు. 8 ఎంఎం నుంచి 16 ఎంఎం వరకు నాలుగు గ్రేడులు కలిగిన స్టీల్‌ను ఆమె మధురవాడలో టన్నుకు కనిష్టంగా రూ.62వేలు, గరిష్టంగా 64,500 వంతున కొనుగోలు చేశారు. రెండు రోజుల వ్యవధిలో అత్యవసరమై అదే బ్రాండ్ స్టీల్ తగరపువలసలో కొనుగోలు చేయగా ఆమె కళ్లకు వ్యాపారులు చుక్కలు చూపించారు. టన్నుకు కనిష్ట ధర రూ.75,520, గరిష్టంగా రూ.76,700 వంతున కక్కించారు.

దీనిపై ఆమె సదరు వ్యాపారిని నిలదీయగా మౌనమే సమాధానమయింది. ఈ రెండు ప్రాంతాల మధ్య సిమెంట్ ధరల్లో పెద్దగా వ్యత్యాసం లేకపోయినా స్టీల్ ధరలు టన్నుకు రూ.12వేలు తేడాగా ఉన్నాయన్నారు. పైగా మధురవాడ నుంచి వ్యాపారులు రవాణా కూడా ఉచితంగా ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ ధరల వ్యత్యాసంపై అధికారులు దృష్టి సారించాలని నిర్మాణదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఇస్కాన్‌లో వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ రాధా దామోదరులను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం పూజలు చేశారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లో శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు ప్రారంభించారు. వైద్యులు ఎ.బాలనాగ శ్రీకర్ రోగులకు పరీక్షలు జరిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, మండల ఆర్‌ఎంపీల సంఘం అధ్యక్షుడు ఆర్.అప్పారావు, ఆర్ఎంపీలు కె.ఎస్.నాయుడు, రామనారాయణ పాల్గొన్నారు.

15 నుంచి చేనేత ఉత్పత్తుల ప్రదర్శన

బీచ్ రోడ్డు: క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(సీసీఏపీ) ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ బజార్ పేరుతో చేనేత హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్టు సీసీఏపీ సంయుక్త కార్యదర్శి రేణుకా రాణి ఒక ప్రకటనలో తెలిపారు. దసపల్లా హిల్స్‌లోని గాంధీ కమ్యూనిటీ సెంటర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనలో బొబ్బిలి చీరలు, పొందూరు ఖాదీ వస్త్రాలు, కళాఖండాలు, స్క్రోల్ అండ్ మార్బల్ గులక రాళ్లు, చేతితో అత్యంత కళాత్మకంగా తయారు చేసిన అనేక రకాల ఆకృతుల్లో తాటాకు బుట్టలు, బంజార సూది వర్క్ వంటివి అందుబాటులో ఉంటాయన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటలకు వరకు ఈ ప్రదర్శన జరుగుతుందని పేర్కొన్నారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ



సాగర తీరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

బీచ్ రోడ్డు: ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం సాగరతీరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఆస్పత్రి సిబ్బంది, నగర యువత పాల్గొన్నారు. గ్లకోమా అనేది కంటిపై ఒత్తిడి పెరుగుదలతో వచ్చిన సమస్య అని, ఇది కోలుకోలేని అంధత్వానికి దారితీస్తుందన్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

ఎంవీపీ కాలనీ: త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఎంవీపీ కాలనీ సెక్టార్-3లో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో భాగంగా త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్ గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన 100 ఆధ్యాత్మిక గ్రంథాలను పంపిణీ చేశారు.

చరిత్ర సృష్టించిన వీరుడు సీఎం జగన్

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: సొంతంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగి చరిత్ర సృష్టించిన గొప్ప వీరుడు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించిన తర్వాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం ఎన్నో అవమానాలు, ఆటంకాలను సృష్టిస్తే వాటిని తట్టుకుని ఒక ధీరుడిలా పోరాడారని కొనియాడారు. ఎన్నికల ముందు పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ అమలు చేస్తున్నారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు సీఎం జగన్ పాలనా విధానాలకు ఆకర్షితులవుతున్నారని, ఇది మనందరికీ గర్వకారణమన్నారు. అందరికీ మేలు జరుగుతుంటే భరించలేని ప్రతిపక్షాలు అర్థంలేని ఆరోపణలు, కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు, అసెంబ్లీ ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారన్నారు. త్వరలో విశాఖ పరిపాలనా రాజధాని అవుతున్న క్రమంలో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జీవీఎంసీ 4వ వార్డు కార్పొరేటర్ దౌలుపల్లి కొండబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామానాయుడు, 3వ వార్డు పార్టీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, నాయకులు వాసుపల్లి కొండబాబు, కదిరి ఎల్లాజీ, ఎస్.కరుణాకరరెడ్డి, వాసుపల్లి ఎల్లాజీరావు, కోండ్రు రామసూరప్పడు, ఆర్.ప్రభాకర్‌నాయుడు, బింగి హరికిరణ్‌రెడ్డి, సిల్ల వంశీరెడ్డి, ఎర్నింటి అచ్చిబాబు, చిల్ల ప్రమీల, జి.సన్యాసినాయుడు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, సిరిగుడి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మొకర అప్పలనాయుడు, నాయకులు సిరుగుడి ఆదినారాయణ, ఈర్ల ఈశ్వరరావు, మరగడ అప్పారావు, సుంకర నారాయణరావు, తాలాడ పద్మనాభం, బోని సన్యాసినాయుడు, పాల్గొన్నారు.



పద్మనాభంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ రాంబాబు, లక్ష్మణరావు

వైఎస్సార్‌సీపీయే రాష్ట్రానికి దిక్సూచి

తగరపువలస: గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రాష్ట్రం ముందంజలో ఉందని, దీన్ని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, కొన్ని మీడియా సంస్థలు వక్రబుద్ధితో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చిల్ల బాబయ్యరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం జీరు వెంకటరెడ్డి కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అక్కరమాని మంగరాజుతో కలిసి వారంతా కేక్ కట్ చేశారు. అనంతరం సమాజానికి సేవ చేస్తున్న పలువురిని సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కన్నతల్లి వంటి పార్టీకి సేవలు అందించే వారికి పదవులతో పనిలేదని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత టీడీపీ కనుమరుగు అవుతుందన్నారు. ఆ పార్టీపై ప్రజలతోపాటు నాయకులకు కూడా విశ్వాసం పోయిందన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడం ఖాయమన్నారు. నాయకులు చిల్ల గణేష్‌రెడ్డి, జీరు వేణుగోపాలరెడ్డి, చేట్ల రమణారెడ్డి, జీరు త్రినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు ముఖ్యం



బహుమతులు అందిస్తున్న నరసింగరావు

తగరపువలస: చిట్టివలస శ్రీకృష్ణ జూనియర్ కళాశాల విద్యార్థుల వీడ్కోలు వేడుకలు బొగ్గులదిబ్బలోని కళాశాల నూతన భవనంలో ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ బి.నరసింగరావు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తమ విద్యతోపాటు నైతిక విలువలు ముఖ్యమని, వాటిని బోధించడమే తమ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో ఆహుతులను అలరించారు. అకడమిక్ ప్రిన్సిపాళ్లు కె.సింహాచలం, తాతారావు, రాజేష్‌కుమార్, జె.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి నేడు శంకుస్థాపన

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెంలో శ్రీ కార్యసిద్ధి మహాగణేష జానకీమాత సహిత శ్రీ నగరాదీస కల్యాణ రామ చంద్రస్వామి దేవాలయం నిర్మాణానికి సోమవారం ఉదయం శంకుస్థాపన చేయనున్నారు. ఏర్పాట్లు చేసినట్లు దేవాలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా శ్రీచైతన్య మహాప్రభు జయంతి వేడుకలు



మహాచైతన్య ప్రభుకు పుష్పాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆనందపురం: మండలంలోని గంభీరం ఐఐఎం రోడ్డు హరేకృష్ణ వైకుంఠం వద్ద ఆదివారం శ్రీచైతన్య మహాప్రభు జయంతి వేడుకల్లో భాగంగా జగన్నాథ మిశ్రా ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు హరేకృష్ణ వైకుంఠ మందిరం వద్ద ప్రవచనాలు వినిపించారు. నితాయి గౌరాంగ విగ్రహాలకు అభిషేకం, హారతి, అఖండ నామసంకీర్తనతోపాటు సప్తనదుల నుంచి తీసుకొచ్చిన జల కలశాలలో పంచామృతం, పంచగవ్య, సువాసనలు వెదజల్లే పుష్పాలు, పండ్ల రసాలతో అభిషేకించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. హరేకృష్ణ మహా మంత్రాన్ని భక్తులు జపించారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రైల్వే ఉద్యోగులు, అధికారుల కోసం వాల్తేర్ డివిజన్ ఆదివారం దొండపర్తిలోని రైల్వే హాస్పిటల్‌లో న్యూరో, కార్డియాలజీ సమస్యలపై ఉచిత వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించింది. చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ తిరు అరుల్ జోతి పర్యవేక్షణలో రైల్వే ఆస్పత్రి వైద్యుల బృందం సేవలందించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని మాట్లాడారు. వ్యక్తిగత ఆరోగ్యం, పోషణ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం ప్రతి రైల్వే ఉద్యోగి, సిబ్బంది బాధ్యతని పేర్కొన్నారు. నిర్దేశిత సమయాల్లో ఇటువంటి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే ఆస్పత్రిలో అనుభవజ్ఞులైన వైద్యులు, సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకోవాలని ఉద్యోగులకు ఆయన సూచించారు. అధికారులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, వారికి నాణ్యమైన వైద్యం అందించే ఉద్దేశంతో ఈ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఎం చెప్పారు. మెడికల్ క్యాంప్‌లో సుమారు 57 మంది అధికారులు, 3 కుటుంబాల సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకోగా.. వీరిలో కొత్తగా నలుగురు హైపర్ టెన్షన్‌తో, ఇద్దరు డయాబెటిస్ మెల్లిటస్‌తో, ఇద్దరు ఇస్కెమిక్ హార్ట్ డిసీజస్‌తో బాధపడుతున్నట్లు కనుగొన్నారు. వీరిలో అవసరమైన వారికి తదుపరి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కేర్ హాస్పిటల్స్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వేణుగోపాల్ ఉద్యోగులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.

అరకు అందాలు మైమరిపిస్తాయి..

ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి



ఎగ్జిబిషన్‌లో చిత్రాలను తిలకిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

బీచ్ రోడ్డు: అరకు అందాలను నేరుగా చూసినా, చిత్రాల్లో చూసినా మనస్సును మైమరిపిస్తాయిని తెలుగు ప్రపంచ చిత్రకారులు సమాఖ్య ఏర్పాటు చేసిన నేషనల్ గ్రూప్ షో ద్వారా తెలిసిందని ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. తెలుగు ప్రపంచ చిత్రకారులు సమాఖ్య ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని విశాఖ మ్యూజియంలో నేషనల్ గ్రూప్ షో పేరుతో మూడు రోజుల పాటు జరగనున్న ఎగ్జిబిషన్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను చిత్రాల ద్వారా బంధించి రాబోయే తరాలకు అందించాలన్నారు. చిత్రలేఖనం అంత సులభం కాదన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కళ్లకు కట్టినట్లు గీసిన చిత్రాలు మనస్సును హత్తుకుంటున్నాయన్నారు. నగరవాసులు ఈ ప్రదర్శనను సందర్శించి గిరిజన జీవన శైలిని తెలుసుకోవాలన్నారు. యూ ప్రొఫెసర్ డి.సింహాచలం, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పక్కా ఏర్పాట్లు



భీమిలి పోలింగ్ బూత్‌లో అధికారులు



భీమిలి యూపీ స్కూల్ వద్ద ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ లక్ష్మణమూర్తి

తగరపువలస/ భీమిలి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి భీమిలి, తగరపువలస పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మధురవాడ జోన్ ఏసీపీ చుక్కా శ్రీనివాసరావు, భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి, ఎంపీడీవో ఎం.వెంకటరమణ తదితరులు 295, 296 పోలింగ్ కేంద్రాలున్న భీమిలి ఎంఎఫ్‌సీ యూపీ స్కూల్‌తోపాటు 297 సంతోపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్‌ను ఆదివారం సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. అక్కడి పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు. మరోవైపు పోలింగ్ అధికారులు కేంద్రాలకు చేరుకున్నారు.

ఆనందపురం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ కోసం ఆనందపురం ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ 293 నంబర్‌తో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 781 మంది, 294వ నంబరు బూత్‌లో 818 మంది ఓటర్లు తమ హక్కుని వినియోగించుకోనున్నారు. ఈ మేరకు పాఠశాలకు చెందిన రెండు భవనాలను కేటాయించారు. రెండు పోలింగ్ బూత్‌లకు ఎనిమిది మంది సిబ్బందిని నియమించారు. బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్స్‌లను ఆదివారం ఉదయమే కేంద్రాలకు తరలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు 144వ సెక్షన్ అమలు పరుస్తున్నారు.

పద్మనాభం: పద్మనాభంలో సోమవారం జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. మండలంలో 1067 మంది ఓటర్లు ఉన్నారు.

పీఎం పాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పీఎం పాలెం, మధురవాడ ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఏర్పాట్లు చేశామని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపారు. చంద్రంపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లకు 100 మీటర్లు దూరం వరకు మాత్రమే ప్రజలకు అనుమతి ఉంటుందన్నారు. ఎన్నికల సమయం పూర్తయ్యే వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. పోటీ చేసిన అభ్యర్థులను మాత్రమే పోలింగ్ బూత్‌లలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు.

చంద్రంపాలెంలో కేంద్రాల పరిశీలన

మధురవాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆర్‌డీవో భాస్కరరెడ్డి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 6 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, వసతులు, సిబ్బంది తదితర విషయాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఆయనవెంట విశాఖ రూరల్ మండల తహసీల్దార్ రమణయ్య, ఆర్ఐ మల్లేశ్వరరావు ఉన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక విశాఖ ఉక్కు



దీక్షా శిబిరంలో పాల్గొన్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిన విశాఖ ఉక్కుపై కేంద్ర, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తెలుగువారికి అభ్యంతరాన్ని కలిగిస్తున్నాయని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్టీల్ ప్లాంట్ దీక్షలు ఆదివారం నాటికి 459వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు మోండా తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య నేతృత్వంలో కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ పోరాట యోధుల ప్రాణత్యాగాలు, ఉద్యమాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తే సహించేదిలేదన్నారు. దళితులు, బలహీనవర్గాలు, పేదల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయపార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయని, త్వరలోనే ప్రధానిని కలిసి అభ్యంతరం తెలుపుతామన్నారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, వై.మస్తానప్ప, కొత్త సత్యానారాయణ, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, హెచ్‌ఎస్ఎల్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సెక్రటరీ అనిల్‌కుమార్, కొండలరావు ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యవర్గం

ఎంవీపీ కాలనీ: విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఎంవీపీ కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా దేవీశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జి.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ప్రసన్నకుమార్, డాక్టర్ టీఎస్ దీప్తి ఎన్నికయ్యారు.